క్లుప్తంగా

అన్నసమారాధన



అన్న ప్రసాదం వడ్డిస్తున్న డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక 26వ డివిజన్ ఇన్నీసుపేటలోని వాకా అప్పలస్వామి స్కూల్ సమీపంలో నిర్వహించిన లక్ష్మీ గణపతి నవరాత్ర ఉత్సవాలలో భాగంగా సోమవారం మహాన్నదానం జరిపారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు ముఖ్యఅతిథిగా హాజరై అన్నప్రసాదం పంపిణీ చేశారు. ముందుగా గణపతిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆయనను ఉత్సవ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రూరల్ డివిజన్ల క్లస్టర్ అధ్యక్షుడు మింది నాగేంద్ర, కమిటీ సభ్యులు కొప్పినీడి ప్రసాద్ (రాజమౌళి), మేడపాటి కృష్ణారెడ్డి, బూరా హనుమంతరావు, రామకృష్ణ, హరి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారవేత్త కృష్ణారెడ్డి మృతి



రాజమహేంద్రవరం సిటీ: ప్రముఖ క్రూసిబుల్ వ్యాపారస్తుడు, ఫుట్‌బాల్ క్రీడాకారుడు కర్రి కృష్ణారెడ్డి (బుల్లెట్ కృష్ణారెడ్డి)(81) ఆదివారం తన స్వగృహంలో మృతి చెందారు. ఆయన పార్థివ దేహానికి నగర ప్రముఖులు, రెడ్డి సామాజిక వర్గ ప్రతినిధులు, పలువురు క్రీడాకారులు నివాళులర్పించారు. ఇన్నీసుపేట రోటరీ కైలాసభూమిలో సోమవారం అంత్యక్రియలు జరిగాయి. కృష్ణారెడ్డికి కుమార్తె, ముగ్గురు కుమారులు ఉన్నారు.

వరద బాధితులకు విరాళం

కడియం: విజయవాడ వరద బాధితులకు సాయంగా పలువురు విరాళాలు అందజేస్తున్నారు. కడియం మండలంలోని నర్సరీ అసోసియేషన్, రైతులు, వివిధ పార్టీలు, మహిళా సంఘాలు ఇప్పటికే విరాళాలు అందించిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా షిర్డిసాయి స్కూలు యాజమాన్యం రూ.లక్ష విరాళాన్ని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరికి సోమవారం అందజేసింది. వీరవరం టీడీపీ గ్రామ కమిటీ తరఫున రూ.20 వేలు, దుళ్ల గ్రామానికి చెందిన నర్సరీ రైతు యన్నమని లక్ష్మీపతి రూ.1,116లను విరాళంగా అందించారు.

నవంబర్ 3న శెట్టిబలిజల వనసమారాధన



సమావేశంలో మాట్లాడుతున్న సానబోయిన రామారావు

ప్రకాశం నగర్: ఈ ఏడాది నవంబర్ 3న రాష్ట్ర స్థాయి శెట్టిబలిజ వనసమారాధన నిర్వహిస్తున్నామని సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సానబోయిన రామారావు అన్నారు. తిలక్ రోడ్డులోని సంఘ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఏటా నిర్వహిస్తున్న మాదిరిగానే ఈ సంవత్సరం కూడా రాష్ట్ర స్థాయిలో శెట్టిబలిజలతో వనసమారాధన నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఉచిత వివాహ వేదిక నిర్వహిస్తామని, పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన శెట్టిబలిజ విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందిస్తామన్నారు. విలేకరుల సమావేశంలో ఎం.సత్యనారాయణ, గుబ్బల ఉదయ్ భాస్కరరావు, చెల్లుబోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్‌లో త్రిషాల్ సత్తా

ప్రకాశం నగర్: గౌతమి టేబుల్ టెన్నిస్ క్రీడాకారుడు త్రిషాల్ రాజ్ కుమార్ జాతీయ స్థాయి పోటీలలో సత్తా చాటి, సిల్వర్ మెడల్ సాధించాడు. ఈ విషయాన్ని కోచ్ వీటీవీ సుబ్బారావు సోమవారం ప్రకటనలో తెలిపారు. హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రా రెయిన్‌బో అకాడమీలో ఈ నెల 11న ప్రారంభమైన పోటీలలో అండర్ - 15 బాలుర విభాగంలో ఈ ఘనత సాధించడన్నారు. ఈ సందర్భంగా త్రిషాల్‌ను జిల్లా టీటీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు భాస్కర్ రామ్, అధ్యక్షుడు జీవీవీ అప్పారెడ్డి తదితరులు అభినందించారు.

ప్రజా న్యాయవాది తారకం



తారకం చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న రత్నరాజు తదితరులు

కడియం: ప్రజా న్యాయవాది బొజ్జా తారకం అని పలువురు కొనియాడారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకుని పొట్టిలంకలో చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రిపబ్లికన్ పార్టీ నాయకుడు నక్కా వెంకటరత్నరాజు మాట్లాడుతూ తారకం సేవలను గుర్తు చేసుకున్నారు. కారంచేడు నరమేధం తరువాత దళిత మహాసభ వ్యవస్థాపకులయ్యారన్నారు. అనేక పోరాటాలకు నాయకత్వం వహించిన అలుపెరగని ఉద్యమ సారథి తారకం అన్నారు.



బొమ్మూరు నేతాజీ నగర్ బృందావన కాలనీలో వేడుకల్లో పాల్గొన్న మహిళలు



తల్లి ఒడికి చేరుకుంటున్న వినాయకుడు



రాజమహేంద్రవరంలో గణపతి విగ్రహాన్ని పంటుపైకి ఎక్కిస్తున్న సిబ్బంది

బైబై గణేశా..

- భక్తిశ్రద్ధలతో గణపతి విగ్రహాల నిమజ్జనం
- ఘనంగా ఊరేగింపులు
- తరలివచ్చిన భక్తులు

సీటీఆర్‌ఐ: గణపతి నవరాత్ర వేడుకలను సిటీ, రూరల్ నియోజకవర్గాలలో ఘనంగా నిర్వహించారు. వాడవాడలా మండపాలు ఏర్పాటు చేసి, గణపతికి పూజలు నిర్వహించారు. ఇక నిమజ్జనాల కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. చవితి ఉత్సవాల మూడో రోజు నుంచి అరకొరగా విగ్రహాలను గోదావరిలో నిమజ్జనం చేశారు. చివరి రోజు ఆదివారం భారీగా విగ్రహాల నిమజ్జనోత్సవం జరిగింది. ఇక సోమవారం ఈ కార్యక్రమం కొనసాగింది.

వినాయకుని ఆశీస్సులతో..

గణనాథుని ఆశీస్సులతో గణేష్ నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించామని రాజమహేంద్రవరం గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు జక్కంపూడి విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పేర్కొన్నారు. పుష్కర ఘాట్ వద్ద జరుగుతున్న



పుష్కరఘాట్ వద్ద పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సృష్టి గణపతి నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూర్ణాహుతి హోమంలో జక్కంపూడి



భక్తులకు పసుపు, కుంకుమను వితరణ చేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజా పాల్గొన్నారు. సాయంత్రం సృష్టి గణపతిస్వామి పసుపు, కుంకుమను జక్కంపూడి విజయ లక్ష్మి చేతుల మీదుగా భక్తులకు వితరణ చేశారు.

పర్యావరణ పరిరక్షణ

జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం పెన్నులు, గాజులు, నాణేలు, లడ్డూలు ఇలా ఒక్కో ఏడాది ఒక్కో విధంగా గణపతిని ప్రతిష్ఠ చేసి ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం వాటిని భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ ఏడాది పసుపు, కుంకుమతో రూపుదిద్దుకున్న సృష్టి గణపతిని కూడా అదే మాదిరిగా భక్తులకు వితరణ చేయడం జరిగిందన్నారు. రాజమహేంద్రవరం గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 9 రోజుల పాటు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు.

ధవళేశ్వరంలో..

ధవళేశ్వరం: రామపాదాలరేవులో సుమారు 40 విగ్రహాలను నిమజ్జనం చేశారు. రథం వీధి గాంధీ బొమ్మ సెంటర్‌లో యడ్ల వెంకటేష్, రథం వీధి రాయల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథున్ని సోమవారం రాత్రి నిమజ్జనం చేశారు. అంతకు ముందు ప్రత్యేక అలంకరణలో గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



గణనాథునికి 150 రకాల ఆహార పదార్థాలతో నైవేద్యం సమర్పించిన మహిళలు



నిమజ్జనానికి తరలివెళుతున్న గణనాథుడు

లడ్డూ విజేత కనకలక్ష్మి

గణపతి నవరాత్రుల సందర్భంగా యడ్ల మహేష్, రథం వీధి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద 60 కేజీల లడ్డూను లక్కీ డ్రా తీశారు. ఇందులో వేమగిరికి చెందిన వాసంశెట్టి కనకలక్ష్మి విజేతగా నిలిచి లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం స్వామివారిని ఊరేగించి రామపాదాల రేవులో నిమజ్జనం చేశారు.

జోరుగా నిమజ్జనాలు

కడియం: గణపతి నవరాత్రులు ముగిసిన నేపథ్యంలో సోమవారం వినాయక విగ్రహాల నిమజ్జనాలు జోరుగా నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, డీజే మ్యూజిక్‌లు, తీన్‌మార్ డ్యాన్సులతో యువత ఆయా కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఉత్సవాలపై పోలీసుశాఖ ప్రత్యేక పర్యవేక్షణ ఉంచిన నేపథ్యంలో ప్రతి గ్రామంలోనూ పహారా ఏర్పాటు చేశారు. ముందు జాగ్రత్త చర్యగా ఆయా ఉత్సవ కమిటీలకు ఇప్పటికే అవగాహన కల్పించామని కడియం ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరరావు తెలిపారు. కడియంలోని బ్రాహ్మణరేవు, వేమగిరి, జేగురుపాడు, కడియపులంక, పొట్టిలంక కాలువ రేవుల్లో నిమజ్జనాలు జరిగాయి.

150 రకాల ప్రసాదాలతో నైవేద్యం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): 16వ డివిజన్ తూర్పు రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న బీఆర్‌కే అపార్ట్‌మెంట్‌లో నిర్వహించిన గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా సోమవారం ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాథునికి స్వీట్లు, పండ్ల రసాలు, వివిధ రకాల 150 పదార్థాలతో నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో పూజాది కార్యక్రమాలు నిర్వహించి, మేళతాళాలతో ఊరేగింపు జరిపి వినాయకుడిని నిమజ్జనం చేశారు.

వైభవంగా వేడుకలు

రాజమహేంద్రవరం రూరల్: నియోజకవర్గంలో సోమవారం వినాయక నిమజ్జనం వేడుకలు ఘనంగా నిర్వహించారు. బొమ్మూరు నేతాజీ నగర్ బృందావన కాలనీలోని వరసిద్ధి వినాయక స్వామివారి ఊరేగింపు ఘనంగా జరిగింది. కార్యక్రమంలో గణపతి భక్త బృందం పాల్గొన్నారు. బొమ్మూరు వెంకటగిరి కొండపై గణపతి నవరాత్ర వేడుకలలో భాగంగా వినాయకుడిని వైభవంగా ఊరేగించి, నిమజ్జనం చేశారు.

బాలికకు ఇంటి పత్రాలు అందజేత

రాజమహేంద్రవరం సిటీ: తల్లిదండ్రులు చనిపోవడంతో అమ్మమ్మ, తాతయ్య సంరక్షణలో ఉంటున్న బాలికకు తల్లిదండ్రులకు చెందిన ఇల్లు, ఆస్తి పత్రాలు దక్కేలా చేయడంలో వైఎస్సార్ సీపీ నాయకుడు, నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్, గౌతమీ జీవకారుణ్య సంఘం మాజీ చైర్మన్ బర్రే కొండబాబు సోమవారం విజయం సాధించారు. వివరాల్లోకి వెళితే.. సింహాచలనగర్ శివాలయం సమీపంలో బాధితురాలి కుటుంబానికి చెందిన ఇంటిలో కొంతకాలంగా వేరేవారు ఉంటున్నారు. తమ మనవరాలికి న్యాయం చేయాలని బాలిక తాతయ్య, అమ్మమ్మ, పిన్ని తదితరులు కొండబాబును కోరారు. దీంతో ఆయన సోమవారం అక్కడికి వెళ్లి.. ఆ ఇంట్లో ఉన్నవారిని ఖాళీ చేయించారు. బీసీ వర్గానికి చెందిన బాలిక విత్తనాల గీతా శైలు (శెట్టిబలిజ)కు ఇంటిపట్టా ఒరిజనల్ డాక్యుమెంటును, ఇంటి తాళం చెవులను అందించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ 2004లో తాను స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా ఉన్న సమయంలో వికలాంగుడైన విత్తనాల నాగేశ్వరరావుకు ఈ ఇంటి పట్టాను అతని భార్య విత్తనాల



ఇంటి పట్టాను చూపిస్తున్న బర్రే కొండబాబు

అనంతలక్ష్మి పేరుమీద ఇచ్చామన్నారు. 2012లో గీతా శైలు పుట్టిందన్నారు. ఆ తర్వాత తల్లిదండ్రులు మృతి చెందడంతో 12 ఏళ్ల బాలిక అమ్మమ్మ చిట్టూరి మహాలక్ష్మి, తాతయ్య చిట్టూరి పుల్లయ్య సంరక్షణలో నర్సిపూడిలో ఉండి చదువుకుంటోందన్నారు. అయితే ఆ ఇంట్లో ఆమె నాన్న తరఫు బంధువులు ఉంటున్నారన్నారు. తల్లిదండ్రుల ఆస్తి న్యాయంగా, వారసత్వంగా ఆ బాలికకు చెందాల్సి ఉన్నందున ఆ ఇంట్లో వారిని ఖాళీ చేయించామన్నారు. స్థానిక పెద్దలు సమక్షంలో గీతాశైలుకి ఇంటిని స్వాధీన పరిచామని తెలిపారు.

'పోలవరం'పై మరో శ్వేతపత్రం విడుదల చేయాలి

సీటీఆర్‌ఐ: పెరిగిన అంచనా వ్యయాలతో పోలవరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి చంద్రబాబు మరో శ్వేత పత్రం విడుదల చేయాలని ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యం కావడంతో నిర్వాసితుల సంఖ్య మరింత పెరుగుతుందన్నారు. 2020 ఫిబ్రవరి 29న పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ బి.సుధాకర్ బాబు కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో ఎస్టీలు 56,495, ఎస్సీలు 7,134, ఓబీసీలు 34,266, ఓసీలు 7,706.. మొత్తం 1,05,601 కుటుంబాలు వారు నిర్వాసితులవుతున్నారన్నారు. 18 ఏళ్ల నిండిన ప్రతి వ్యక్తి ఒక కుటుంబంగా కొత్త భూసేకరణ చట్టం



శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్న ఆదివాసీ మహాసభ సభ్యులు

పేర్కొందన్నారు. 2020 నాటికి 14 ఏళ్ల ఉన్నవ్యక్తి ఇప్పుడు 18 ఏళ్లకు రావడంతో ఒక కుటుంబంలా పరిగణించబడతారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల చేసిన శ్వేతపత్రంలో మొత్తం నిర్వాసితుల సంఖ్య 96,660గా వెల్లడించారన్నారు. అంటే సుమారు 10 వేల కుటుంబాలను తగ్గించి చూపించారన్నారు. ఏ గ్రామాలను ముంపు నుంచి తప్పించారో వివరణ ఇవ్వలేదన్నారు. శ్వేతపత్రంలో చంద్రబాబు చెప్పిన ఈ లెక్కలన్నీ వాస్తవం కాదన్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు 2007లో ఇచ్చిన ఆదేశాల మేరకు మొత్తం 276 గ్రామాలకు భూసేకరణ పూర్తి చేసి నష్టపరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించిన తరువాతనే ప్రాజెక్టులో నీరు నింపే నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉందన్నారు. ఇవన్నీ జరగాలంటే భూసేకరణకు, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ కి సుమారు రూ.లక్ష కోట్లు అవసరముంటుందన్నారు. ప్రభుత్వం వెంటనే నిపుణులతో చర్చించి తిరిగి పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అయ్యే వ్యయాన్ని లెక్కకట్టాలన్నారు.

ఆవ కాలువకు మోక్షం కలిగేనా..

- ఆక్రమణలు, పూడికతో అధ్వానంగా మారిన వైనం
- హుకుంపేటలో జరుగుతున్న ఆక్రమణల తొలగింపు పనులు
- బొమ్మూరులో ప్రారంభమెప్పుడో..



బొమ్మూరులో ఆవ కాలువ పరిస్థితి

రాజమహేంద్రవరం రూరల్: గోదావరి వరద ఉధృతంగా ఉన్న సమయంలో బొమ్మూరు, హుకుంపేట గ్రామాల్లో పలు ప్రాంతాలు నీటమునుగుతున్నాయి. వరద తగ్గే వరకూ ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి ప్రధాన కారణం ఆవ కాలువలో పూడికతీత పనులు జరగకపోవడమే. ఈ నేపథ్యంలో కలెక్టర్ ప్రశాంతి ముంపు ప్రాంతాలను పరిశీలించి, ఆవకాలువ వెంబడి ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. దీంతో హుకుంపేట గ్రామంలో ఆప నులు చేపట్టారు, కానీ బొమ్మూరులో ఇంకా మొదలు కాలేదు.

హుకుంపేటలో జోరుగా..

కలెక్టర్ ఆదేశాల మేరకు హుకుంపేటలో అధికారులు చర్యలు ప్రారంభించారు. ఆవ కాలువ వెంబడి ఆక్రమణల తొలగించడంలో భాగంగా కాలువ వెంబడి ఉన్న భవనాలకు, ఇళ్ల యజమానులకు నోటీసులు జారీ చేశారు. త్వరితగతిన ఖాళీ చేయాలని, లేని పక్షంలో భవనాలను కూల్చివేస్తామని హెచ్చరించారు. మరోవైపు ఆవ కాలువలో పూడికతీత పనులు సైతం జోరుగా సాగుతున్నాయి. కానీ బొమ్మూరులోని ఆవకాలువ వెంబడి ఆక్రమణలతో పాటు పూడికలను సైతం మొదలు కాలేదు.

ఆక్రమణలను తొలగించాలి

బొమ్మూరులోని బాలాజీపేట సెంటర్ నుంచి నేతాజీ నగర్ మీదుగా సుద్దగని రైల్వేట్రాక్ వరకు ఆక్రమణలు తొలగింపు చర్యలు చేపట్టాలి. అంతే కాకుండా పూడికలను తీయాల్సిన అవసరం ఉంది. కానీ అధికారులు ఇప్పటి వరకూ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. బొమ్మూరు ఆవ కాలువ వెంబడి భవనాలు, ప్రహరీలు చాలా వరకు ఆక్రమణలకు గురయ్యాయి. నవభారతీ నగర్ ప్రాంతంలో ఆవ కాలువను ఆక్రమించుకోవడంతో పాటు కనీసం పూడికలు తీసేందుకు జేసీబీలను వెళ్లకుండా అడ్డుకున్న సందర్భాలు సైతం అనేకం ఉన్నాయి. జాతీయ రహదారి నుంచి చెరుకూరి గోడౌన్స్ దగ్గర నుంచి బాలాజీపేట వరకు భారీగానే ఆక్రమణలు ఉన్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ఎండలు తీవ్రతరంగా ఉన్న నేపథ్యంలోనే ఆవకాలువ ఆక్రమణలు తొలగిస్తే బాగుంటుందని గ్రామప్రజలు కోరుతున్నారు. ఇంకా సర్వేయర్లు పూర్తిస్థాయిలో సర్వే చేయకపోవడం వలనే ఆక్రమణలు తొలగింపునకు ఆలస్యమవుతుందని కొందరు చెబుతున్నారు.

ఆదేశాలు రాగానే..

హుకుంపేట గ్రామంలో ఆక్రమణలు తొలగింపు జరుగుతోంది. బొమ్మూరు గ్రామంలో సర్వేయర్లు సర్వే చేస్తున్నారు. ఎంపీడీవో, తహసీల్దార్ ఆదేశాలు జారీ చేయగానే గ్రామంలోని ఆవకాలువ వెంబడి ఆక్రమణలను తొలగిస్తాం. ఆక్రమణలతో పాటు పూడికలను తీస్తే బొమ్మూరు నేతాజీనగర్ ప్రాంతానికి ముంపు సమస్య తప్పుతుంది.

– ఎస్.శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి, బొమ్మూరు



చెరుకూరి గోడౌన్స్ నుంచి బాలాజీపేట వరకూ ఆక్రమణకు గురైన కాలువ

నిబంధనలు పాటించకుంటే చర్యలు



హోటల్‌ను పరిశీలిస్తున్న శానిటరీ సూపర్ వైజర్ శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ పరిధిలో నిర్వహిస్తున్న రెస్టారెంట్లు, ఫుడ్ కోర్టులు, తోపుడుబండ్ల వ్యాపారులు, హోటళ్ల యజమానులు తయారు చేసే ఆహార పదార్థాలు నాణ్యతతో ఉండాలని శానిటరీ సూపర్‌వైజర్ ఐ.శ్రీనివాస్ అన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాలపై సోమవారం నగరంలోని పలు రెస్టారెంట్లు, హోటళ్లు, స్వీట్ స్టాళ్లను ఆయన పరిశీలించారు. అక్కడ వంటగది పరిసరాలు, ఆహార పదార్థాలు నాణ్యతపై ఆరా తీశారు.

సినిమాలు

శ్యామల	:	35 చిన్నకథకాదు
సూర్యమినీ	:	ఉత్సవం
సూర్యప్యాలెస్	:	ఏఆర్ఎం
స్వామి	:	సరిపోదా శనివారం
అశోక	:	ఆయ్
శివజ్యోతి	:	మత్తు వదలరా–2
అనుశ్రీ	:	మత్తు వదలరా–2
రాజా	:	మత్తు వదలరా–2
రంభ	:	కళింగ
ఊర్వశి	:	భలే ఉన్నాడే, కమిటీ కుర్రోళ్లు
మేనక	:	3
కుమారి	:	ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్ (గోట్)
అప్సర	:	సరిపోదా శనివారం
నామవరం		
వీఎస్ మహల్	:	ఏఆర్ఎం
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	మత్తు వదలరా–2
కడియం		
వెంకట సూర్య	:	మత్తు వదలరా–2

సమ సమాజ స్థాపనకు ఏచూరి కృషి

కడియం: సమ సమాజ స్థాపనకు సీతారాం ఏచూరి చేసిన కృషి మరువలేనిదని జేగురుపాడు సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ అన్నారు. సీతారాం తన బాల్యాన్ని గడిపిన జేగురుపాడు గ్రామంలో సోమవారం ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సర్పంచ్ స్టాలిన్ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీకి అంతర్జాతీయ ఐకాన్‌గా మారిన సీతారాం ఏచూరి అడుగుజాడలు తమ గ్రామమైన జేగురుపాడులో ఉండటం ఎంతో గర్వకారణం అన్నారు. నిమ్నవర్గాల అభ్యున్నతికి, సమాజంలో అంతరాలు రూపుమాపడానికి ఆయన చేసిన కృషి, పోరాటాలు ఒక చరిత్ర అన్నారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా పేరుపొందిన ఏచూరి నేటి సమాజానికి దిక్సూచి అన్నారు. కార్యక్రమంలో యూటీ



జేగురుపాడులో ఏచూరికి నివాళులర్పిస్తున్న సర్పంచ్ స్టాలిన్ తదితరులు

ఎఫ్ నాయకులు చిలుకూరి శ్రీనివాసరావు, ఎంపీటీసీ ఆకుల సుధాకర్, మాజీ ఎంపీటీసీలు నాగిరెడ్డి వీరశివాజీ, అద్దంకి సుజాత వెంకట రమణారావు, పాలపర్తి ప్రకాష్‌కుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ శ్రేణులపై కూటమి నాయకుల దాడి



అనపర్తి ఏరియా ఆసుపత్రిలో బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: మండలంలోని కాపవరం గ్రామంలో జరిగిన వినాయక నిమజ్జనంలో వైఎస్సార్ సీపీ శ్రేణులపై కూటమి నాయకులు దాడి చేశారు. గ్రామ సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ, సత్యంశెట్టి వర ప్రసాద్, కొట్టు శ్రీనివాస్, సత్యంశెట్టి ఆనంద్ రాజ్, సత్యం శెట్టి సుధీర్, సత్యంశెట్టి శివరామకృష్ణ తదితరులపై సోమవారం దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. క్షతగాత్రులను అనపర్తి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితులను ఆస్పత్రిలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయరెడ్డి క్షతగాత్రులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు చేస్తున్న దాడులు, దౌర్జన్యాలకు అంతులేకుండా పోయిందన్నారు. ఆయన వెంట నల్లమిల్లి మురళీమోహన్ బాలకృష్ణారెడ్డి, ఎంపీటీసీ కొండేటి భీమేష్, ఎంపీటీసీ మార్శెళ్ల భీష్ముడు, మాజీ ఎంపీటీసీ నిడదవోలు శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

నేడు డీ వార్మింగ్ డే

రంగంపేట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన (డీవార్మింగ్ డే) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ సీహెచ్‌ఓ కె.జయమణి తెలిపారు. రంగంపేట, సింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని అంగన్ వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 8,658 మంది పిల్లలున్నారని, వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేస్తామన్నారు. ఇప్పటికే ఈ కార్యక్రమంపై ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తల ద్వారా అవగాహన కల్పించామన్నారు.

సీతానగరం: నూలి పురుగుల నిర్మూలన దినోత్స



సీతానగరం పీహెచ్‌సీలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యసిబ్బంది

వాన్ని పురస్కరించుకుని సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు రాజు, సిబ్బంది సోమవారం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో వైఎస్ రాయుడు, సూపర్ వైజర్ సుధాకర్, స్టాఫ్ నర్స్ నాగమణి, హెచ్ఎ నందీశ్వరరావు, ఫార్మసిస్ట్ నగేష్ పాల్గొన్నారు.